## క్లుప్తంగా

### కుటుంబంతో ఆనందంగా గడపాలి: సిద్దిపేట సీపీ



హోంగార్డును అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సీపీ అనురాధ పేర్కొన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించిన అబ్దుల్ రసూద్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా అతడిని సీపీ, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్ర బోస్ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ధరణికుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నూతన అధ్యక్షుల నియామకం



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా గొల్లపల్లి శ్రీనివాస్, కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా ఎల్లయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ జహంగీర్, మండల సేవాదళ్ అధ్యక్షుడిగా అశోక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రాజలింగం మండల అర్గనైజింగ్ సెక్రటరీగా రాకం ప్రభాకర్, కార్యదర్శిగా సార్ల లింగం , సంయుక్త కార్యదర్శులుగా ములుగు రాజు, శిఖ శ్రీనివాస్, కొయ్యడ బాబులను నియమించారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అభినందించారు

### భద్రాచలం చేరుకున్న గోటి తలంబ్రాలు



ఏఈవోకు గోటి తలంబ్రాలను అందజేస్తున్న రామరాజు

గజ్వేల్‌రూరల్: శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమం గజ్వేల్ ప్రాంత భక్తులకు రావడం సంతోషంగా ఉందని రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు పేర్కొన్నారు. భక్తులచే సిద్ధం చేయించిన 250 కిలోల గోటి తలంబ్రాలను తిరిగి భద్రాచల దేవస్థాన ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోటి తలంబ్రాల దీక్షలో గజ్వేల్‌తో పాటు సరిహద్దు జిల్లాల భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

### నూతన నియామకం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ నేషనల్ కో ఆర్డినేటర్‌గా నియామకమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపడంతో పాటు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు యేసురెడ్డి, దుబ్బాక మండల అధ్యక్షుడు కొంగర రవి, జిల్లా నాయకులు శ్రీనివాస్, శ్రీరాం నరేందర్ ఉన్నారు.

### ఎల్లమ్మ తల్లికి వెండి కవచం వితరణ



బహూకరిస్తున్న రాజేశ్వర్ రావు దంపతులు

హుస్నాబాద్: పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతారావు తనయుడు బొప్పరాజు రాజేశ్వర్ రావు-జ్యోతిర్మయి దంపతులు శుక్రవారం ఎల్లమ్మ తల్లికి వెండి కవచం బహూకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చండీ హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కిషన్ రావు పాల్గొన్నారు.

## దారి ఇలా.. వెళ్లేదెలా?



చెలుకలపల్లి వద్ద గుంతలమయమైన రోడ్డు

మండల పరిధిలోని చెలుకలపల్లి-కొత్తపల్లి గ్రామాల మధ్య రోడ్డు పొడవున గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట):

# సాల్వాపూర్ టు వట్టిపల్లి డబుల్ రోడ్డు

- రూ. 8 కోట్లతో 4 కిలోమీటర్ల మేర పనులు
- ఆర్‌అండ్‌బీ మంత్రి ఆదేశాలతో మరూ..
- నిర్మాణం పూర్తయితే సాఫీగా వాహనాల రాకపోకలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



వట్టిపల్లిలో కొనసాగుతున్న డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇక సరిహద్దు రవాణా సులభతరం కానుంది. జిల్లాల వాహనాల రాకపోకలకు అంతరాయం తప్పనుంది. ఏళ్ల సమస్యకు చెక్ పడనుంది. సాల్వాపూర్ టు వట్టిపల్లి రోడ్డు నిర్మాణ పనులు వడివడిగా కొనసాగుతున్నాయి.

జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి గ్రామం నుంచి మూడు జిల్లాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది. సిద్దిపేట, జనగామ, యాదాద్రిభువనగిరి జిల్లాల నుంచి భారీ వాహనాలు ఎక్కువగా రాకపోకలు ఈ రోడ్డు ద్వారానే సాగిస్తుంటాయి. ఇతర జిల్లాల నుంచి హైదరాబాద్ రాజీవ్ రహదారికి వెళ్లడానికి వట్టిపల్లి మీదుగా దగ్గరగా ఉంటుంది. గ్రామంలో ఇళ్ల మధ్య లో నుంచి రోడ్డు ఉండటం వల్ల ప్రజలు వాహనాల తో ఇబ్బందులు పడేవారు. అలాగే రోడ్డు కూడా సింగిల్‌గా ఉండటంతో ఎదురుగా మరో వాహనం వస్తే గంటల పాటు అంతరాయం కలుగుతోంది.

### మంత్రి ఆదేశాలతో కదలిక

పలుసార్లు వట్టిపల్లి తాజా మాజీ సర్పంచ్ రజిత, గ్రామస్తులు అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా రూ. 8 కోట్ల నిధులు మంజూరు చేసింది. కానీ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఏడాదిన్నర పైగా వేచి చూసిన గ్రామస్తులు ప్రస్తుత ప్రభుత్వంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి రోడ్డు నిర్మాణానికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో నెల రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

### కొనసాగుతున్న పనులు

జనగామ జిల్లా సాల్వాపూర్ నుంచి జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి వరకు 4 కిలోమీటర్ల డబుల్ రోడ్డు పనులు జోరందుకున్నాయి. రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే వాటికి మార్కింగ్ చేశారు. ప్రస్తుతం పాత రోడ్డును తవ్వి మట్టి, కంకర పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు పనులు చకచకా కొనసాగుతుండటంతో గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశం మాట్లాడుతూ వట్టిపల్లి టు సాల్వాపూర్ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతతో పాటు పనుల్లో వేగం పెంచుతున్నామని పేర్కొన్నారు.

## యువత చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం



చేతి పంపును రిపేర్ చేస్తున్న యువత

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు యువత ముందుకు వచ్చి విరాళాలు సేకరించి చేతి పంపులను రిపేర్ చేయించారు. గ్రామంలో పోచమ్మ, హనుమాన్ దేవాలయం దగ్గర చేతి పంపులు రిపేరుకు రావడంతో నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగినా స్పందించలేదు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ.20వేల నిధులు సమకూర్చుకొని రెండు చేతి పంపులను శుక్రవారం రిపేర్ చేయించారు. దీంతో యువతను గ్రామస్తులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో కుమార్, అనిల్, శ్రీధర్, రాజు, అనిల్ పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చే కుట్ర



జగదేవ్‌పూర్(గజ్వేల్): మందాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



చిన్నకోడూరు(సిద్దిపేట): మల్లారంలో కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర

రాజ్యాంగాన్ని మార్చేందేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో రాజ్యాంగ పరిరక్షణ కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్‌ను అవమానించేలా కుట్ర చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే మన హక్కులు కూడా హరించబడతాయని ప్రజలకు వివరించారు.



సిద్దిపేటకమాన్: లింగారెడ్డిపల్లిలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

### ఉత్సవ కమిటీ ఎన్నిక

హుస్నాబాద్: మహనీయుల జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం శుక్రవారం రాజ రాజేశ్వర ఫంక్షన్‌లో హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కన్వీనర్‌గా లింగాల సాయన్న, కో కన్వీనర్లు కొమ్ముల భాస్కర్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, తొందూరి ఎల్లయ్య, సుధాకర్, కొమురయ్య, హరీశ్, శంకర్ బాబు, రమేష్, సింగరి, వినోద్, ఇంతియాజ్, శివరాజ్, అశోక్, రాంప్రసాద్, శ్రీనివాస్, కో ఆర్డినేటర్‌గా సంపత్ కుమార్, గౌరవ సలహాదారులను ఎన్నుకున్నారు.

### మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం .. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.5,500 జరిమానా, వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

### కొమ్మూరికి కృతజ్ఞతలు

చేర్యాల(సిద్దిపేట): మద్దూరు మండలం నుంచి కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాలను పూర్తి స్థాయిలో చేర్యాల మండల పరిధిలో కలిపేలా కృషి చేసినందుకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయనను గ్రామస్తులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సయ్య, మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ శంకరాచారి, నాయకులు చంద్రశేఖర్, రాజేష్, మల్లయ్య, రామచంద్రం, శ్రీశైలం పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు



ఆలయ ఆవరణలో భారీ హనుమాన్ విగ్రహం

కోహెడరూరల్(హుస్నాబాద్): శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది చైత్రశుద్ధ నవమి రోజు సాయంత్రం కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 400 ఏళ్ల కిత్రం గ్రామంలో స్వయంభుగా మోయతుమ్మెద వాగు ఒడ్డున ప్రకృతి సిద్ధమైన కొండ సొరికలో స్వామి వారు వెలిశారు. ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా 32 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం ఉండటం విశిష్టత. సీతారాముల బ్రహ్మోత్సవాలు సుమారు నాలుగు రోజుల పాటు జరుగుతాయి. ఈ నెల 6వ తేదీ నుంచి జరగనున్న జాతరకు ఆలయం ముస్తాబైంది. ఆదివారం సీతారాముల కల్యాణం, మంగళవారం శకటోత్సవం(బండ్లు తిరుగుట), బుధవారం రాత్రితో పాటు గురువారం ఉదయం రథోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజరి శ్రీరంగం రామచార్య తెలిపారు.

## చెత్తను వేరు చేసి ఇవ్వాలి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



సిబ్బందిని సన్మానిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: చెత్తను వేరు చేసే బాధ్యత ఇచ్చేవారిదేనని, విభజనకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంలో అత్యధికంగా సేకరించిన సిబ్బందిని శుక్రవారం సన్మానించారు. ఆటో డ్రైవర్ సదానందం, వర్కర్ ప్రభాకర్‌లకు రాగి బిందె, రాగి గ్లాసులు, స్టీల్ వాటర్ బాటిల్, స్టీల్ ప్లేట్లతో కూడిన కిట్లను బహుమతిగా అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త విభజనపై అవగాహన కల్పించేందుకు నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్‌వైజర్లు నవీన్, సాయి, జవాన్లు సారయ్య, ప్రభాకర్ ఉన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పైపులైన్లను పరిశీలిస్తున్న అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ ఏఈ సాయికృష్ణ, మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) గుగులోతు మోహన్ నాయక్ తెలిపారు. శ్రీరాంతండా, హాతీరాం అంబనాయక్ తండా గ్రామాల్లో శుక్రవారం వారిద్దరూ పర్యటించారు. ఈ సందర్భంగా పంచరాయి తండాలో ఉన్న బావిలో పూడికతీతతో పాటు బావి దరి కూలకుండా చుట్టూ సిమెంట్ గాజులు నిర్మించాలన్నారు. అలాగే డెక్యానాయక్ తండా బోర్ టూ వాటర్ ట్యాంక్ వరకు కొత్త పైపులైన్, గండిపల్లి గ్రామంలో కొత్తగా పైపులైన్ తీసేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న లీకేజీల పైపులైన్ల మరమ్మతులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంపత్, తండావాసులు వెంకటేశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో ఆలోచన శక్తి పెరుగుదల



లైబ్రరీ పుస్తకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట): పుస్తక పఠనంతో విద్యార్థులలో ఆలోచన శక్తి పెరుగుతుందని ఎంఈఓ మహతి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గుండారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలకు మూడేళ్లలో 1400 పుస్తకాలు ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా రూం టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో పెన్సిల్స్, క్రేయాన్స్‌ను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతి, మధుకర్, మాజీ ఎంపీటీసీ లత, దేవయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



దౌల్తాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ లతీఫ్

జగదేవ్‌పూర్(గజ్వేల్)/దౌల్తాబాద్(దుబ్బాక )/కొండపాక(గజ్వేల్): శ్రీరామనవమి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని వేర్వేరు చోట్ల సీఐలు పీస్ కమిటీ శాంతి సమావేశాలు నిర్వహించారు. జగదేవ్‌పూర్‌లో గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, దౌల్తాబాద్, కొండపాక మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ఆయా సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. శ్రీ రామనవమి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలను, ర్యాలీలను, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వైరల్ చేస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రమోహన్, ఎస్సైలు శ్రీరామ్ ప్రేమ్‌దీప్, శ్రీనివాస్, ఆయా గ్రామాల యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ



పెద్దకోడూరులో పంపిణీ ప్రారంభిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక): ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీని శుక్రవారం మండల పరిధిలోని పెద్దకోడూరులో తహసీల్దార్ హరికిరణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సామల సంతోష్ ప్రారంభించారు. తొగుట మండలంలోని ఘనపురం, బంజేరుపల్లి గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి ప్రారంభించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అముతుల్, పంచాయతీ కార్యదర్శులు బాలమణి, మాధవి, నాయకులు నరేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, స్వామి, శ్రీను, భిక్షపతి పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ 12న వీర హనుమాన్ విజయయాత్ర**

సిద్దిపేటకమాన్: శ్రీరామ నవమి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో సీతారాముల కల్యాణం, శోభాయాత్ర నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. అలాగే హనుమాన్ జయంతి సందర్భంగా వీర హనుమాన్ విజయ యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనిల్, శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ**

తొగుట(దుబ్బాక): మండల కేంద్రానికి చెందిన జంగని మహేష్‌కు రూ.30వేలు, ఎల్లారెడ్డిలో నందారం భూపాల్‌కు రూ.30వేల విలువైన చెక్కులను నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, అనిత, నాయకులు శ్రీనాకర్‌రెడ్డి, నర్సిహులు, మల్లారెడ్డి, మధు, కనకయ్య, యాదగిరి, ఆంజనేయులు పాల్గొన్నారు.

**◆ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి ఉత్సవ మూర్తులను శుక్రవారం గ్రామంలోని ఆలయం నుంచి గుట్టపైకి తీసుకెళ్లారు. మహిళల బోనాలు, కోలాటాల మధ్య రథంపై ఊరేగింపుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి శేషం మధుసూదనాచారి, చైర్మన్ ప్రభాకర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**◆ చలివేంద్రం ఏర్పాటు**

దుబ్బాక : దుబ్బాక పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సివిల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సివిల్‌క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్, రాజమౌళి, శ్రీధర్, స్వామి, దేవేందర్, భగవాన్ పాల్గొన్నారు.

**◆ సన్మాన కార్యక్రమం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రిటైర్డ్, ప్రమోషన్‌లు, డాక్టరేట్ పొందిన సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, జిల్లా సాంఘీక శాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. సాంఘీక శాస్త్ర అభ్యున్నతి కోసం ఫోరం ఏర్పాటు చేశామని ఫోరం సభ్యులు రాదారి నాగరాజు తెలిపారు.

**◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

దౌల్తాబాద్ (దుబ్బాక ) : పలు అభివృద్ధి పనులకు మెదక్ ఎంపీ రఘునందన్ రావ్ రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారని మండల బీజేపీ అధ్యక్షుడు నరసింహా రెడ్డి లావణ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.13 లక్షలు, ఓ కాలనీలో రూ.7 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గ ప్రసాద్ , మాజీ సర్పంచ్ ఆది వేణు గోపాల్ , నాయకులు నర్సింలు పాల్గొన్నారు.

**◆ బైక్‌ను ఢీకొట్టిన అడవి పంది.. – ముగ్గురికి గాయాలు**

మద్దూరు(హుస్నాబాద్): బైక్‌ను అడవిపంది ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన మద్దూరు మండల పరిధిలోని నర్సాయపల్లి గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సాయపల్లికి చెందిన గుస్క రమేష్, తుమ్మ పవన్‌కుమార్, తుమ్మబాబు చేర్యాలలో తమ విధులు నిర్వహించుకొని, తిరిగి గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు అడ్డంగా అడవి పంది వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ పై నుంచి ముగ్గురు కిందపడటంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

**◆ సమన్వయంతో పని చేయాలి**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను ఎండోమెంట్, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని ఎంపీడీఓ, ప్రత్యేక అధికారి ప్రవీణ్ సూచించారు. మండలంలోని టీటీడీ కల్యాణ మండపంలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, గ్రామపంచాయతీ, ఆలయ కమిటీతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, ఏఓ పీవీ శర్మ, ఏఎస్‌ఐ శంకర్‌రావు, పూజారి మధుసూదనాచారి పాల్గొన్నారు.

**◆ రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాజీవ్ యువ వికాసం పథకాన్ని బీసీ, ఈ బీసీలకు చెందిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నాగరాజమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బీసీలు ఈ నెల 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలోని ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

**◆ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళా సంఘాల ద్వారా మహిళలు మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం డాకయ్య అన్నారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల పరిధిలోని లింగుపల్లి, మల్లుపల్లి, ఖాజీపూర్, మోతె గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు వైకుంఠం, దేవదాస్, శ్రీనివాస్, బాలరాజు, వీవోఏలు మహేష్, భూపాల్, నసీరుద్దీన్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

**శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి**

కొండపాక(గజ్వేల్): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందేలా కృషి చేయాలని డీఆర్‌డీఓ విశ్రాంత శాస్త్రవేత్త బాలకిషన్ పేర్కొన్నారు. కుకునూరుపల్లిలోని హైస్కూల్లో ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం బాలకిషన్‌ను జ్ఞాపికతో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు.

**◆ ఇసుక డంప్ సీజ్**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారు సుందరయ్యనగర్‌లో ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. స్థానిక ఆర్‌ఐ ఐలయ్య కథనం ప్రకారం... మండల పరిధిలోని ఆకునూరు వాగు నుంచి కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలించి సుందరయ్యనగర్‌లో డంప్ చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

**◆ 14 నుంచి మా భూమి రథయాత్ర**

మిరుదొడ్డి(దుబ్బాక): బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ)ల ఆధ్వర్యంలో ఈ నెల 14న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విశారదన్ మహారాజ్ నేతృత్వంలో మా భూమి రథయాత్రను ప్రారంభిస్తున్నామని డీఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు మహారాజ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని డా.బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దీపక్ మహారాజ్, ఉపాధ్యక్షుడు రవి, నాయకులు మనోజ్, నర్సింహులు పాల్గొన్నారు.